జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 6-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 64 పేజీలు: 8 వెల: రూ.7






# ఈ సీటు.. చాలా.. హాట్ గురూ!

* టూ టౌన్ సీఐ పోస్టుకు మంచి డిమాండ్
* లక్షలు పెట్టి మరీ.. ఇక్కడికి వచ్చేందుకు పలువురు ఆసక్తి
* బదిలీల సమయంలో సీఐ సీటు కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
* సెటిల్‌మెంట్ స్టేషన్‌గా ప్రాచుర్యం
* ఇక్కడ క్రిమినల్ కేసులు కంటే.. సివిల్ కేసులే ఎక్కువగా నమోదు
* రాజీ చేసేందుకు పోలీసు పెద్దలు మొగ్గు
* టోకెన్ రేటును బట్టి కేసుకు ప్రాముఖ్యత
* జనరల్ కానిస్టేబుళ్లకూ.. కాసులే కాసులు


**శ్రీకాకుళం క్రైం, జులై 5 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సెటిల్‌మెంట్ స్టేషన్ అని చాలామంది పిలుస్తుంటారు. ఇక్కడ క్రిమినల్ కేసుల కన్నా.. సివిల్ కేసులే ఎక్కువగా నమోదవుతుంటాయని, నిత్యం సెటిల్‌మెంట్లు జరుగుతుంటాయన్న గుసగుసలు వినిపిస్తుంటాయి. నిత్యం జనాలతో స్టేషన్ కిటకిటలాడుతుంటోంది. ఈ స్టేషన్‌లో సీఐ పోస్టుకు మంచి డిమాండ్ ఉంది. ఈ సీటుకు వెయిట్ ఎక్కువ అని ఇక్కడి పోలీసులే అంటుంటారు. రెండో పట్టణ సీఐ పోస్టింగ్ కోసం ఇతర ప్రాంతాల్లో పనిచేసేవారు పలువురు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతల వద్ద ప్రదక్షిణలు, లాబీయింగ్ చేస్తుంటారట. మంత్రుల స్థాయిలోనే లాబీయింగ్ చేస్తారట. ఇక్కడ సీఐ పోస్టింగ్‌కు లక్షలకు లక్షలు ఇచ్చుకుంటారట. ఏంటో మరి ఈ డిమాండ్. ఎంతైనా పరవాలేదు.. ఇక్కడ పోస్టింగ్ ఇస్తే చాలు.. ఏడాదిలో టార్గెట్ రీచ్ అవుతామన్న ధీమాలో ఉంటారట. సీఐ పోస్టు మాత్రమే గాకుండా ఎస్ఐ, కానిస్టేబుళ్లు కూడా ఈ స్టేషన్‌లో పనిచేసేందుకు ఆసక్తి, మక్కువ కనబరుస్తుంటారట. స్టేషన్‌లో యూనిఫారం లేకుండా.. ఎక్కువగా ఇతరత్రా పనుల్లోనే కొందరు కానిస్టేబుళ్లు బిజీబిజీగా ఉంటారట. కానిస్టేబుళ్లకు మంచి బీట్‌లు పడుతుంటాయి. ఒకరు షాపులు, ఇంకొకరు బస్సులు, మరొకరు లాడ్జీలు.. ఇలా కొందరు పంచేసుకుని స్టేషన్‌కు ఆదాయం తెస్తుంటారని బయట గుసగుసలు వినిపిస్తుంటాయి. టోకెన్ రేటును బట్టి కేసుకు ప్రాముఖ్యత ఉంటుందన్న వాదన కూడా ఉంది. సీఐ, ఎస్ఐలకు ఎవరైతే నమ్మకంగా ఉంటారో వారి హవా ఇక్కడ నడుస్తుందన్నది స్టేషన్‌లో టాక్. బదిలీల సమయంలో ఇక్కడ సీఐ నుంచి కానిస్టేబుళ్ల వరకూ సుదూర ప్రాంతాలకు విసిరివేయబడుతుంటారు. అంటే వారిపై ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వస్తుంటాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ స్టేషన్‌లోనే పోలీసులకు ఒకరంటే ఒకరికి గిట్టదు. పంపకాల విషయంలో తేడాలు రావడమే ఇందుకు కారణమన్న టాక్ కూడా ఉంది. శ్రీకాకుళం నగరంలో ఒకటో పట్టణం, రెండో పట్టణం, రూరల్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ మూడింటిలో మంచి డిమాండ్ ఉన్న స్టేషన్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ అని అందరూ చెబుతుంటారు. కోర్టుల చుట్టూ తిరిగితిరిగి డబ్బులు, సమయం వృథా కాకుండా ఉండేందుకే ఈ స్టేషన్‌లో ఎక్కువ కేసులు రాజీ చేస్తుంటారని బయట అందరూ చెప్పుకుంటారు. ఏదేమైనప్పటికీ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేయాలంటే పుణ్యం చేసుకోవాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు. ఏంటో ఈ స్టేషన్ లోగుట్టు ఆ పెరుమాళికే ఎరుక.

**జిల్లా కేంద్రంలోని జనరల్ కానిస్టేబుళ్ల దందాపై త్వరలో మరో కథనం విత్ ప్రూఫ్‌తో..**

# కాలి సమస్యకు.. బ్రెయిన్ స్కానింగ్!

* టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఓ వైద్యుడి నిర్వాకం
* విస్తుపోయిన బాధితురాలు
* టెక్కలి జిల్లా ఆసుపత్రిలో కొందరు వైద్యుల తీరు
* వైద్యుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

**టెక్కలి, జులై 5 (వార్త):** టెక్కలి నియోజకవర్గ, పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవ అందించే దిశగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత టెక్కలి ఆసుపత్రికి అంకురార్పణ చేశారు. మూడు దశాబ్దాల కిందట 100 పడకల ఆసుపత్రితో పూర్తిస్థాయి భవనాలతో టెక్కలిలో అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి రూపుదిద్దుకుంది అయితే ప్రస్తుతం అన్నగారి ఆశయం నీరుగారుతోంది. టెక్కలి జిల్లా ఆసుపత్రిగా మారిన తర్వాత వైద్యులు, సిబ్బంది తీరుపై ప్రతిరోజు విమర్శల వర్షం కురుస్తోంది. ఈ ఆసుపత్రిని ఎవడూ బాగు చేయలేడురా బాబు అన్న చందంగా మారిపోయింది. వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది. విషయం లోకి వస్తే.. గురువారం ఓ రోగి స్కానింగ్ కోసం వస్తే పవర్ లేదని గంటల కొద్దీ కటిక నేలపైనే వదిలేశారు. ఈ విషయం పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. ఈ సంఘటన మరువకముందే శు




క్రవారం సంతబొమ్మాళి మండలం కాశీపురం గ్రామానికి చెందిన అప్పిని లక్ష్మి తన కాలి సమస్యతో టెక్కలి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చింది. వైద్యుడికి చూపించింది. అయితే ఆ వైద్యుడు స్కాన్ చేయాలంటూ సిఫార్సు లేఖను ఇచ్చారు. అయితే ఆ సిఫార్సు లేఖలో బ్రెయిన్ స్కానింగ్ అని రాసిచ్చి స్కానింగ్ చేసుకోమని చెప్పి పంపించారు. స్కానింగ్ సిబ్బంది ఏం ప్రాబ్లం అని ఆమెను అడిగేసరికి తన కాళ్లకు ఇబ్బంది అని చెప్పేసరికి అదేంటి సిటీ స్కాన్ బ్రెయిన్ అని రాశారని చెప్పేసరికి బాధితురాలు నిర్ఘాంతపోయింది. ఆమె విషయం అక్కడున్న వారికి చెప్పడంతో ముక్కున వేలేసుకున్నారు. ఇదేంటిది కాలుకు దెబ్బతగిలితే బ్రెయిన్‌కు స్కానింగ్ ఏంటని వైద్యుడి తీరుపై మండిపడ్డారు. ఆసుపత్రి వైద్యుల పనితీరును నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న ఈ సంఘటనపై ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా ఆసుపత్రి అభాసుపాలయ్యే అవకాశం ఉంది.





## శిలాఫలకం ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

**మందస, జులై 5 (వార్త):** మండలంలోని సొండిపూడి సచివాలయంలో ప్రారంభోత్సవ శిలాఫలకంను గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం సొండిపూడి, మూలిపాడు పంచాయతీ సర్పంచులు చిచ్చుల నళిని, శ్రీనివాసరావు, గుసిరి వెంకటరావు, ఎంపీటీసీ దడ్డ దమయంతి, సచివాలయ సిబ్బంది శిలాఫలకం ధ్వంసంపై మండల పరిషత్ కార్యాలయ అధికారులకు, మందస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### ఒడిశా టు ఆంధ్రాకు..

# ఇసుక అక్రమ రవాణా

*** కొత్తూరు, ఆమదాలవలస, శ్రీకాకుళం మీదుగా విశాఖ తరలింపు * అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా రవాణా * ఆయా పోలీస్‌స్టేషన్లకు మామూళ్లు * కాసుల మత్తులో పట్టించుకోని పోలీసులు**



**ఆమదాలవలస, జులై 5 (వార్త):** ఒడిశాలోని కాశీనగర్ ప్రాంతం నుంచి ఆంధ్రాలోకి ఇసుక గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి వేళ లారీల్లో తరలిపోతోంది. గతంలో ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ఇసుక తరలించరాదని నిబంధనలు ఉండేవి. ఒడిశా ఇసుక మన ఆంధ్ర ఇసుక కన్నా బాగుంటుందని ఎక్కువగా విశాఖపట్నంలో ఉన్న అపార్ట్మెంట్ యాజమానులు ఎక్కువగా ఒడిశాకు చెందిన ఇసుకను కొనుగోలు చేసేందుకు బిల్డర్లు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఒడిశా నుంచి ఆంధ్రాకు పెద్ద ఎత్తున ఇసుక వాహనాలు విశాఖ వైపు తరలిపోతున్నాయి. కాశీనగర్ నుంచి కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, ఆమదాలవలస నుంచి కొత్తరోడ్డు మీదుగా విశాఖ జాతీయ రహదారి మీదుగా తరలిపోతుంది. దారి పొడవునా ఉన్న పోలీస్‌స్టేషన్లకు ఇసుక తరలింపుదారులు కాసులు ముట్టజెబుతుండడంతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధిక లోడుతో ఈ ఇసుక లారీలు వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతుండడమే గాకుండా రోడ్లు గతుకులుగా మారుతున్నాయి. గతంలో ఒడిశా నుంచి ఇసుక తరలిస్తున్న లారీ యజమానులపై అధికారులు కేసులు నమోదు చేసేవారు. దీంతో ఒడిశా ఇసుక రవాణా కట్టడైంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఒడిశా నుంచి ఇసుక తరలింపు దందా తెరలేపారు. పగలు సరుబుజ్జిలి నుంచి ఆమదాలవలస వరకు రోడ్డు సైడ్‌న, పగలు ఇసుక లోడుతో నింపుకొని ఉంచి రాత్రి 9 గంటల తర్వాత ఆమదాలవలస నుంచి బయలుదేరుతున్నాయని పరిసర ప్రాంతాల వారు ఆరోపిస్తున్నారు. ఒడిశా నుంచి అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీలకు ఎటువంటి అనుమతులు లేవని పలువురు చెబుతున్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఒడిశా నుంచి ఆంధ్రాకు అక్రమంగా ఇసుక తరలింపును అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేయండి


### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం:** ఇసుక అక్రమ తవ్వకాలను నిషేదించడానికి పెద్ద ఎత్తున పబ్లిసిటీ ఇవ్వాలని, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆయా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల నివారణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను ఆయన తన ఛాంబర్ లో శుక్రవారం సాయంత్రం మైన్స్ డిడి సత్యనారాయణతో కలిసి విడుదల చేశారు. ఇసుక విషయంలో ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు అనుసరించి శ్రీకాకుళం జిల్లాలో అక్రమ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వచ్చే ఫిర్యాదుల కొరకై టోల్ ఫ్రీ నెంబర్, వాట్సాప్ నెంబరు అలాగే ఈ మెయిల్ ఐడి లను ఇవ్వడం జరిగిందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇసుక అక్రమ తవ్వకాలు రవాణాపై టోల్ ఫ్రీ నెంబర్ 1800 -425-6012, ల్యాండ్ లైన్ నెంబర్ 08942-293229 లేదా 9701691657 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా, అలాగే Dmgosklm sandcom-plaints@myyahoo.com ఈ మెయిల్ ద్వారా గాని ఫోటోలు లేదా వీడియోలు సహాయంతో ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

*** సంతబొమ్మాళి, దండుగోపాలపురం ఆసుపత్రుల్లో రికార్డుల పరిశీలన * 'వార్త'కు స్పందన**

**సంతబొమ్మాళి, జులై 5 (వార్త):** మండలంలో సంతబొమ్మాళి, దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల 'వార్త'లో ప్రచురితమైన 'డాక్టర్లు కావలెను' శీర్షికన వెలువడిన కథనానికి ఆమె ఎట్టకేలకు స్పందించారు. పలు పీహెచ్‌సీలను సందర్శించి రికార్డులు, సిబ్బంది వివరాలు పరిశీలించారు. సిబ్బంది కొరత ఉన్న వివరాలను నమోదు చేసుకొని త్వరలో భర్తీ చేస్తామన్నారు. మందుల గదిలో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, ఓపి గది పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయా లేదా అని రోగులకు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనకు కావాల్సిన మందులు ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. స్టాఫ్ నర్స్,



ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్, కార్యకర్తల పనితీరుపై ఆరా తీశారు. సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. ఆమె వెంట దండుగోపాలపురం, సంతబొమ్మాళి వైద్యాధికారులు డాక్టర్ సుధీర్, సంధ్యారాణి, శివరంజని, ఫార్మసిస్టులు సుబ్రమణ్యం, లావణ్య, ఈఓ నాగేశ్వరరావు, డిపిఓ గణేష్ బాబు, సీసీ నారాయణరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

### ఆసుపత్రిలో పరిశుభ్రతపై

## ఎమ్మెల్యే బగ్గు అసహానం

**నరసన్నపేట/జలుమూరు, జులై5(వార్త):** నరసన్నపేట ప్రభుత్వసామాజిక ఆసుపత్రిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం సందర్శించారు. వార్డుల్లో కలియదిరిగి రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత లేకపోవడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2014-2019 మధ్య తాను శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు రాష్టంలోనే నరసన్నపేట హాస్పిటల్ గర్భిణీలకు సంబంధించిన చికిత్సలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. రోగులకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ జయశ్రీ, డాక్టర్లు, సిబ్బంది, టీడీపీ నాయకులు గొద్దు చిట్టీబాబు, కింజరాపు రామారావు, జామి వెంకటరావు, బోయిన సతీష్, గొలివి రామారావు, మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, లుకలాపు రాంబాబు ఉన్నారు.






## గ్రామ సంఘాలు ఆడిట్ చేయించాలి

**ఆమదాలవలస, జులై 5 (వార్త):** గ్రామ సంఘాలన్నీ సకాలంలో ఆడిట్ రిటర్న్లు పూర్తి చేయాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన వి.వో.ఏ.ల రివ్యూ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం లెక్కలను ముగించి, చార్టర్డ్ అకౌంటెంట్‌తో ఆడిట్ చేయించాలన్నారు. గ్రామ సంఘాలలో నోటీసులు ఇచ్చి, మహాజనసభలు పూర్తి చేసి డీసీఓ ఆఫీసుకు రిటర్న్ ఇచ్చి అకనాలజీమెంట్ తీసుకోవాలని సూచించారు. గ్రామ సంఘాల ద్వారా తీసుకున్న సిఐఎఫ్. శ్రీనిధి, ఉన్నతీ రుణాలను శత శాతం రీపేమెంట్ చేయాలని కోరారు. సిబ్బంది అందరూ ప్రోజెక్టు ప్రాధాన్యతా అంశాలపై శ్రద్ధ వహించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేటట్లు గ్రామాల్లో సిబ్బంది పని చేయాలని ఏపిఎం. పైడి కూర్మారావు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌తోపాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు, అందరు వివోఏలు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు



**మందస, జులై 5 (వార్త):** స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సోంపేట ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది మందస మండలం కొండలోగాం పంచాయతీ పరిదిలో గల చాపరాయి గ్రామంలో నాటుసారా తయారీని అరికట్టేందుకు గ్రామ శివార్లలో దాడులు చేయడం జరిగింది. గ్రామంలో అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై కూడా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది హెచ్‌సి మోహన రావు, కాంతారావు, శాంతరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై 9440902358 నెంబర్ కు తెలియజేయాలని సెబ్ అధికారులు కోరారు. నాటుసారాపై సమాచారం అందించిన వారి వివరాలు అతి గోప్యంగా ఉంచబడతాయని సీఐ జై భీమ్ తెలిపారు.

## నేడు యాంటీరాబిస్ వ్యాక్సిన్లు పంపిణీ

**మందస, జులై 5 (వార్త):** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మందస, హరిపురం పశువైద్యాశాలలో డా.దువ్వాడ శ్రీకాంత్, డా.కిల్లి ఉమాభారతిల ఆధ్వర్యంలో ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, పెంపుడుజంతువులకు (కుక్కలకు) యాంటీరాబిస్ టీకాలను ఉచితముగా వేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ జంతువులనుండి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని, ఈ వ్యాధుల నివారణకు ప్రజలు వీటిపట్ల అవగాహన పెంచుకొని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీటి నివారణ పట్ల చైతన్యవంతులను చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం జులై6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలియజేసారు.

## వైసీపీ ఓటమిని తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**ఆమదాలవలస, జులై5 (వార్త):**జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్య మంత్రి కాలేదని, వైసీపీ అధికారంలోకి రాలేదని ఎన్నికల ఫలితాల నుండి మన స్థాపనకు గురై చివరకు గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే పాత నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన పెంట చిన్నప్పడు (27) వైసీపీ ఓటమి చెందిందని తరచూ బాధపడుతుండేవాడు. కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. చివరికి గురువారం పొలానికి కలుపు నివారించేందుకు వినియోగించే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు వైద్య సేవల కోసం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెంట చిన్నప్పడుకు భార్య, కుమార్తెతో పాటు తల్లి కూడా ఉన్నారు. భర్త ఇటువంటి ఘటనకు పాల్పడడంతో భార్య కన్నీరుమున్నీరవుతోంది. అసలే పేదరికంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి ఆస్పత్రి కి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీపరంగా కుటుంబం ఆదుకునేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్

**శ్రీకాకుళం టౌన్, జులై 5 (వార్త):** శ్రీకాకుళం నగరంలో ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న మొబైల్ అన్నా క్యాంటీన్‌ను పేదల ఆకలి తీరుస్తోంది. ఈ అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి శుక్రవారం నాటికి 441వ రోజుకు చేరింది. ప్రతిరోజూ ఏడురోడ్ల జంక్షన్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేస్తున్నారు. ప్రభుత్వం అన్నాక్యాంటీన్ ఏర్పాటు చేసేంత వరకూ ఈ మొబైల్ అన్నాక్యాంటీన్ కొనసాగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

## సుస్థిర వ్యవసాయంతో రైతులకు మేలు

**మందస, జులై 5 (వార్త):** మందస మండలంలోని రంగనాథపురం గ్రామంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులతో ఏపీఎం గొడబ ప్రసాద రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎం ప్రసాదరావు మాట్లాడుతూ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ గ్రూప్స్ (రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ) సంఘాల సభ్యుల ప్రధాన జీవనాధారం వ్యవసాయమేకాని పంటల దిగుబడి పెరిగినప్పటికి ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయ రంగంలోని ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ ప్రతి రైతు రాబోయే తరాల అవసరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రస్తుత అవసరాలను తీర్చుకోవటమే సుస్థిరమైన వ్యవసాయం ముఖ్య లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక భద్రతతో పాటు ఉత్పత్తి దారులకు, వ్యవసాయ కూలీలకు, వినియోగదారులకు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలను కల్పించడమే సుస్థిర వ్యవసాయం ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యవసాయ వాతావరణం పరిస్థితులను అనుసరించి పంటలు లేదా పంటల సరళిని ప్రోత్సాహించటం, వ్యవసాయానికి అనుబంధంగా చెట్లు, పూల మొక్కలు పెంపకం, పాడి పశువులు పెంపకం, చేపలు పెంపకం, అటవీ వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాదరావు, వీవోఏ మోహని, ఎఫ్‌పీఓ రైతులు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల్లో అవకతవకలపై
## దర్యాప్తు చేయిస్తా
### విజయనగరం డుమా పీడీ ఉమామహేశ్వరి



**వంగర, జులై5 (వార్త):**మండలంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరిపిస్తానని డుమా పీడీ ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం వంగర మండలానికి సంబంధించిన సోషల్ ఆడిట్‌ను మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ ఆడిట్ జరిగింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 17వ విడత సోషల్ ఆడిట్లో జరిగిన అవకతవకలపై తనకు ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై దర్యాప్తు చేయిస్తామన్నారు. తప్పు చేసిన వరి నుంచి రికవరీ చేయిస్తానన్నారు. బాధ్యులకు షోకాజ్ నోటీసు ఇస్తామన్నారు. జిల్లాలో గల అన్ని మండలాల్లో ఇంతవరకూ1.35 లక్షల పనిదినాలు ఉపాధి హామీ పనులు చేసినట్లు చెప్పారు. పౌల్ట్రీ, మినీ గోకులాలు, పశువుల శాలల నిర్మాణాలు అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. గ్రామాల్లో చెరువు పనులను నిలుపుదల చేయాలని ఆదేశించామన్నారు. సామాజిక తనిఖీలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ, టీడీపీ నేత ఎల్.కృష్ణమూర్తి, ఏపీఓ సత్యవతి, ఎంపిడిఓ సాల్మన్ రాజు, తహశీల్దార్ చిరంజీవి, ఆర్‌జేయం జనార్ధన రావు, గజపతి, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ బానూజీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన రావు, ఏపీఓలు ఎం.సత్యవతి, ఎస్.సంగన్నాయుడు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**శ్రీకాకుళం టౌన్, జులై5 (వార్త):** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాలని సీడీపీవో శోభారాణి సూచించారు. స్థానిక కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని కత్తిరివీధి1,కత్తిరివీధి2 అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం విష జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులపై ఆమె అవగాహన పరిచారు. కేంద్రాల పరిధిలో పాటు తమ ఇళ్లల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని తాగాలన్నారు. పరిసరాల్లో మురుగునీటిని నిల్వ ఉంచరాదన్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకోవాళులన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలకు ఆమె సూచించారు. 15వ వార్డ్ ఇంచార్జి ఇప్పిలి తిరుమలరావు చట్టాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు పురవీధుల్లో వ్యాధుల, చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె కె.హిమబిందు, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్త బుజ్జమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు విజయ, హైమావతి, విజయమ్మ, అరుణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

**సంతబొమ్మాళి, జులై5 (వార్త):**మరువాడ పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు ఆధ్వర్యంలో హెచ్‌ఎం మల్లికార్జున విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లల విద్యాభ్యాసానికి అన్ని రకాల వసతులు ప్రభుత్వం కల్పించిందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని దాసురాజు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుగ్గు సీత య్య, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.





# అచ్చెన్న మాటిస్తే.. తగ్గేదెలే!



*** ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు * వైసీపీ హయాంలో మూలపడిన ఎత్తిపోతల పథకాలు * పది రోజుల్లో శరవేగంగా కాలువల్లో పూడికతీత పనులు * పంట పాలాలకు చేరుతున్న వంశధార నీరు**

**టెక్కలి, జులై 5 (వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో ఉన్న ఆరు ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో ఉన్న వ్యవసాయం రంగానికి అత్యంత అవసరమైన వంశధార కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పని తీరుపై దృష్టి సారించారు ఇందులో భాగంగానే మొదట టెక్కలి పట్నం, గొల్లవూరు తదితర గ్రామాల వద్ద కాలువలను పరిశీలించారు అంతేకాకుండా 2014 సంవత్సరంలో టెక్కలి నియోజకవర్గం రైతాంగానికి సాగునీరు అందించే పలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రారంభించారు అయితే ఆ తర్వాత 2019 వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైయస్సార్ పార్టీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, వంశధార కాలువలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. అంతేకాకుండా టెక్కలి నియోజకవర్గంలో వ్యవసాయం రంగంపై కక్ష కట్టినట్లు ఇక్కడ ఉన్న పలు ఎత్తిపోతల పథకాలకు విద్యుత్తును కూడా నిలుపుదల చేశారు. అయితే అప్పట్లో కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉండేది. గ్రామాలకు దూరంగా ఉన్న ఈ ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అక్కడ ఉన్న కేబుల్స్, ట్రాన్స్ఫార్మర్లు మాయమయ్యాయి. ఇటీవల వంశధార, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు ఈ ఎత్తిపోతల పథకాలను సత్వరమే బాగు చేసిన రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో చిన్నసాన ఎత్తిపోతల పథకానికి సుమారు 14.60 లక్షలు, సౌడం ఎత్తిపోతల పథకానికి సుమారు 13.80 లక్షలు, టెక్కలి మదన గోపాల సాగరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 31.20 లక్షలు, సుభద్రాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 4.40 లక్షలు, తొగిరి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 8.35 లక్షలు, టెక్కలిపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 6.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు బాగు చేసి మరికొద్ది రోజుల్లో అందుబాటులో తేవాలని అచ్చెన్నాయుడు సూచించారు. గత ఐదు సంవత్సరాలుగా వంశధార పూడికతీత పనులు జరగక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని అచ్చెన్నాయుడు ఆదుకున్నారని చెప్పాలి. గత 15 రోజులుగా రాత్రింబవళ్లు ప్రధాన కాలువల్లో ప్రొక్లైన్ పెట్టి కాలువ పనులను పూడికతీత పనులు కూడా చేపట్టారు. దీనితో గత రెండు రోజుల కిందట వంశధార నీరు విడిచిపెట్టడంతో ప్రస్తుతం ప్రధాన కాలువలో నీరు గలగల పారుతోంది. వర్షాలు లేనప్పటికీ పొలాలకు నీరు చేరడంతో రైతాంగం అచ్చెన్నపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.




## ఓంకార్ కుటుంబానికి అండగా యూటీఎఫ్

**పలాస, జులై5 (వార్త):** ఓంకార్ మాస్టర్ మృతి యుటిఎఫ్ సంఘానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్, పలాస మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం స్పష్టం చేశారు. పలాస పద్మనాభపురం కాలనీ పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బత్తిన ఓంకార్, బూరెల జగ్గారావు మాస్టర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఓంకార్ మాస్టర్, జగ్గారావు మాస్టర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓంకార్ మాస్టర్ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఉద్దాన ప్రాంత సమస్యలను తన సమస్యలుగా భావించి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుడుగా వృత్తిలో పని చేస్తూ ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. జగ్గారావు మాస్టర్ పలాస ప్రాంతంలో యూటిఎఫ్ నిర్మాణానికి కృషి చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, లఖినాన వెంకటాచలం, కంచరాన రమేష్, లఖినాన డిల్లీశ్వరరావు, సిద్దేశ్వరరావు, గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, దుమ్ము శంకర్రావు, బమ్మిడి ఆనందరావు, దువ్వాడ జనార్ధన, తెప్పల అజయ్ కుమార్, గున్న మధుసూదనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, గున్న రమేష్, కంచరాన జయరాం, ఎస్వి రమణ, పి.సంజయ్ కుమార్, కె రవీంద్ర, బెండి లక్ష్మి, శశిధర్ వర్మ, టి జయరాం, ఎస్వీ పట్నాయక్, ఎం శ్రీనివాసరావు, పోతనపల్లి బాలరాజు, కంచరాన పాపారావు, ఉప్పాడ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పైడిగం ఛానల్‌లో పూడికతీత పనులు

**కంచిలి, జులై 5 (వార్త):** జలంధరకోట, బూర్గం పంచాయతీల వద్ద పైడిగం ఛానల్‌లో పూడిక తీత పనులను ఎంపీడీవో వి.నీరజ పరిశీలించారు. శుక్రవారం ఆమె ఉపాధి హామీ అధికారి బి.ధనుంజయతో కలిసి చానల్లో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. ఆమెతోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్ర సహాయ అధికారులు పాల్గొన్నారు.

## నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

**పలాస, జులై5 (వార్త):** ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా పలాస ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సినేషన్ వేయనున్నారు. యజమానులందరూ తమ పెంపుడు కుక్కలను శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఆసుపత్రికి తీసుకువచ్చి టీకాలు వేయించాలని పశువైద్యులు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం, జులై 5 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కొత్త కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ జీ.ఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతవరకు సమర్థవంతంగా శ్రీకాకుళం జిల్లాలో కలెక్టర్ గా పని చేసిన మనజీర్ జిలానీ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## అక్రమ భవన నిర్మాణాల పరిశీలన

**పలాస, జులై5 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మెగిలిపాడు సర్వేనెంబర్ 246-3లోని చెరువు పోరంబోకులో ఆక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనాన్ని పలాస తహశీల్దార్ ఎస్ఎస్వీఎస్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. అక్రమ భవన నిర్మాణంపై మీ సేవలో వచ్చిన ఫిర్యాదుపై ఆయన స్పందించారు. ఆ భవన నిర్మాణాన్ని పరిశీలించి అక్రమంగా నిర్మాణంగా గుర్తించారు. ఆయన వెంట మండల సర్వేయర్ నిరంజన్, ఆర్ఐ గిరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం టౌన్, జులై5(వార్త):** అధికారులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారునికి అందించే దిశగా అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అందరూ చురుకుగా ఉంటూ పని చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని చెప్పారు. సిబ్బందిని అప్రమత్తతో పని చేయించాలని, అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించిన నాడే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్, శ్రీకాకుళం, పలాస ఆర్డీఓలు సి హెచ్ రంగయ్య, భరత్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు డిపిఓ వెంకట్రావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డిఆర్డిఎ కిరణ్ కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎపిసి జయ ప్రకాష్, మైన్స్ డిడి సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్.అండ్.బి ఎస్ఈ జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేసేందుకు చర్యలు



నూతన నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్అండ్‌బి ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో పెండింగ్‌లో ఉన్న పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పనులు ఏ స్థితిలో ఉన్నది ఆయన పరిశీలించారు. మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే ఇప్పుడే చేసుకోవచ్చన్నారు. ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకొని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరియు ఇతర శాఖలకు సంబంధించిన అందరు జిల్లా అధికారులు ఈ కార్యాలయంలో ఉంటారని, అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే దగ్గర ఉండడం వలన వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఎక్కడకూ తిరిగే అవకాశం ఉండదని వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సేవలందించవచ్చన్నారు. పార్కింగ్, మరుగుదొడ్ల ఇక్కడే ఉంటాయన్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఎఈ రాజు పాల్గొన్నారు.

### సగటు వేతనం పెంచాలి

సగటు వేతనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డ్వామా పిడి ని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఉపాధి హామీ పనులుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. పేమెంట్స్ నిర్ణీత సమయానికి అవ్వాలని ఆదేశించారు. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. జిజిఐ పారామీటర్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథక సంచాలకులు చిట్టిరాజు, ఎపిడిలు, ఉపాధి హామీకి సంబంధించి విజిలెన్స్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కళ్యాణ్ రామ్ జన్మదిన వేడుకలు

**శ్రీకాకుళం టౌన్, జులై 5 (వార్త):** శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలోని పాత శ్రీకాకుళం సంతోషిమాత గుడి దగ్గర ఉన్న బెహరా మనో వికాస కేంద్రంలో ఉత్తరాంధ్ర కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుర్రి మధు ఆధ్వర్యంలో నందమూరి కళ్యాణ్ రామ్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## దోనేకు మరమ్మత్తు చేయాలి

**సారవకోట/జలుమూరు, జులై 5 (వార్త):** సారవకోట మండలం చీడిపూడి గ్రామం వంశధార ఎడమ కాలువ గట్టుపై ఉన్న దోనే శిథిలావస్థకు చేరిందని, దీనివల్ల 70ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని టీడీపీ సారవకోట మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, టీడీపీ నేత నిక్కు జనార్ధంరావు అన్నారు. తక్షణం దీన్ని మరమ్మతులు చేయించి అవలింగి, చీడిపూడి గ్రామాలకు సాగునీరు అందేలా చూడాలని వారు అధికారులను కోరారు.

## నేడు కుక్కలకు రాబిస్ టీకాలు

**కంచిలి, జులై 5 (వార్త):** మండలంలో గల కుక్కలకు రాబిస్ వ్యాధి టీకాలను శనివారం వేయనున్నామని పశు వైద్యాధికారి టి.శిరీష తెలిపారు. శనివారం జునోనిస్ డే సందర్భంగా కంచిలి పశు వైద్యశాలలో కుక్కలకు ఉచితంగా ర్యాబీస్ టీకాలు వేస్తామన్నారు.

## 28 మంది కౌలురైతుల గుర్తింపు

**వంగర, జులై5(వార్త):** మండలంలో కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని ఏవో తట్టికోట కన్నబాబు, రెవెన్యూ అధికారులు మొదలు పెట్టారు. శుక్రవారం కొప్పర, కొండచాకరాపల్లి, కొప్పరవలస గ్రామాల్లో 28 మంది కౌలు రైతులను గుర్తించారు. కౌలురైతులకు ఇచ్చే కార్డులు కౌలు రైతుకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమి మీద ఉండదని ఏవో తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘాలను.. రైతు ఉత్పత్తి సమాఖ్యలుగా మార్పు



**సంతబొమ్మాళి, జులై 5 (వార్త):** జాతీయ సహకార సంస్థ న్యూఢిల్లీ ఆదేశాలతో మత్స్యశాఖ పలాస, టెక్కలి అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వదేశీ మత్స్యకారుల సంఘం వడ్డి తాండ్ర, స్వదేశీ మత్స్యకారుల సంఘం సభ్యులతో టెక్కలి మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ వడ్డితాండ్రలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత్స్యకార సంఘాలను రైతు ఉత్పత్తిదారులు సభ్యులుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు రైతు సహకార సభ్యులుగా ఏర్పాటు చేయడం వలన మత్స్యకారులు కలిగిన లబ్ధి, ఏ విధంగా ఆర్థిక అభివృద్ధి సామాజిక స్వావలంబనకు తోడ్పాటు అవుతుందో ఈ సదస్సులో అధికారులు తెలిపారు. 100 మంది సభ్యులు సంఘంగా ఏర్పడి సర్వసభ్య సమావేశం నిర్వహించుకున్నట్లు, ఆర్థిక సహాయం మత్స్యకారులకు ఆర్థిక అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో వ్యాపార అభివృద్ధి చేసుకోవడం వల్ల ప్రభుత్వ సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస ఏడీ సత్యనారాయణ, టెక్కలి ఎఫ్డిఓ ధర్మరాజు పాత్రో, వడ్డితాండ్ర సహకార సంఘం అధ్యక్షులు పద్మనాభం, హన్ను రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులం ప్రిన్సిపాల్‌గా దేవేందర్

**బూర్జ, జులై 5(వార్త):** కొల్లివలస అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డి.దేవేందర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుప్పలవలస పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో విద్యాలయాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తానన్నారు. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నూక రామకృష్ణ బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిపోవడంతో దేవేందర్ ఇక్కడ విధుల్లో చేరారు.

## జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

### రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు



**వీరఘట్టం, జులై 5 (వార్త):** జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యమని, ఆ దిశగా కార్యకర్తలందరూ ముందుకు సాగాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహన కార్యదర్శి బాబు పాలూరు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం వీరఘట్టంకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త అకుంఠిత దీక్షతో పార్టీని అభివృద్ధి పదంలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ ఉంటుందని తెలిపారు. జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అనుగుణంగా అందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు రమేష్ పొట్నూరు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జానీ, వీరఘట్టం మండల జనసేన నాయకులు ఉదయాన చరణ్, కర్నేన సాయిపవన్, నందివాడ పండు, కరిమెరకాల శ్రీను పాల్గొన్నారు.

## కంటి శస్త్రచికిత్సకి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** తేలుకుంచి గ్రామానికి చెందిన చుక్క పుష్ప అనే నిరుపేద మహిళకి రెండు కళ్లకి ఆపరేషన్ అయ్యింది. యువ భారత్ సేవా ఫౌండేషన్ శుక్రవారం 12వేలు రూపాయలు ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





## గ్రామీణాభివృద్ధి.. దేశాభివృద్ధితోనే

**గార, జులై 5(వార్త):** గ్రామీణాభివృద్ధి దేశాభివృద్ధితోనే ముడిపడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గారలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నిర్వహించనున్న పనులపై శుక్రవారం ఎమ్మెల్యే సమీక్షించారు. నియోజకవర్గంలో పంచాయితీరాజ్ శాఖ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వారం రోజుల్లో ఈ రహదారుల నిర్మాణానికి గాను ప్రతిపాదనలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్లకు పడిన గోతులను పూడ్చాలని, మధ్యలో ఆగిపోయిన రోడ్లు, డ్రైనేజిల పనులను పున: ప్రారంభించాలన్నారు. వీటితో పాటు నూతనంగా చేపట్టాల్సిన పనులకు ప్రణాళికలు అందజేస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు, నిధులు మంజూరు చేయిస్తానని వెల్లడించారు. సమావేశంలో పంచాయితీరాజ్ శాఖ ఎస్ఈ ఎం.వి. శేఖర్, డీఈ, ఈఈలు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధులకు లెక్క చెప్పాల్సిందే

**సంతబొమ్మాళి, జులై 5 (వార్త):** మండల కేంద్రం సంతబొమ్మాళిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సంతబొమ్మాళి పంచాయతీలో 2021 మార్చి ఒకటి నుంచి ఇప్పటి వరకూ వచ్చిన నిధులు, ఖర్చుల లెక్కలను చెప్పాలని సంతబొమ్మాళి టీడీపీ అధ్యక్షుడు చల్ల జగ్గారావు గ్రామసభలో ప్రశ్నించారు. పంచాయతీ నిధులు ఖర్చు వివరాలు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శికి జగ్గారావు వినతిపత్రం అందించారు.

## గొల్లవీధిలో బాలసంజీవిని పంపిణీ

**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు గొల్ల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బాల సంజీవిని పౌష్టికాహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జయ, ఉమ ఆధ్వర్యంలో జరిగింది.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413